మళ్లీ పెరిగిన చికెన్ రేట్లు

● స్కిన్‌లెస్ కిలో రూ. 320 ● నాటుకోడి రూ.400పైనే..

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో చికెన్ రేట్లు మళ్లీ దడ పుట్టిస్తున్నాయి. 15 రోజుల క్రితం వరకు కాస్త అందుబాటులోకి వచ్చిన ధరలు.. ఆదివారం ఒక్కసారిగా పెరిగాయి. కిలోపై రూ.80 నుంచి రూ.100 వరకు పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు చికెన్‌ను కొనుగోలు చేసేందుకు వెనకంజ వేశారు. గ్రేటర్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా చికెన్ రేట్లు గరిష్ఠంగా పెరిగాయి. మార్చి మూడో వారంలో నగరానికి కోళ్ల దిగుమతి పెరగడంతో రేట్లు కాస్తా అందుబాటులోకి వచ్చాయి. ఈ మేరకు మార్చి 17 నుంచి ఏప్రిల్ 2 వరకు లైవ్‌కోడి కిలో రూ.120 నుంచి రూ.140 వరకు, స్కిన్‌లెస్ కిలో రూ.180 నుంచి రూ.200-220 వరకు విక్రయించారు. అయితే రేట్లు అందుబాటులోకి వచ్చాయని భావిస్తున్న తరుణంలో రెండు రోజులుగా మళ్లీ పెంచారు. ఆదివారం స్కిన్‌లెస్ కిలో రూ.300 నుంచి 320 వరకు, లైవ్‌బర్డ్ రూ.200 నుంచి రూ.210 వరకు విక్రయించారు. అలాగే నాటుకోడి కిలో బర్డ్‌ను రూ.400పైగానే అమ్మారు. నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ఎండలను అడ్డుపెట్టుకుని వ్యాపారులు అడ్డగోలుగా దోచుకుంటున్నారని కొనుగోలుదారులు వాపోతున్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

నిరుపేదల కోసమే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు

బర్కత్‌పుర, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నిరుపేద రెడ్డి సామాజిక వర్గాన్ని అన్ని విధాలుగా ఆదుకోవడానికే రాష్ట్ర ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రెడ్డి గర్జన అధ్యక్షుడు గుర్రం పాపిరెడ్డి ఆధ్వర్యంలో 2024 డైరీ ఆవిష్కరణ, వివిధ రంగాలలో రాణిస్తున్న వారికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక సేవా రంగాలలో రెడ్డిసామాజికవర్గం అగ్రస్థానంలో ఉందన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న రాష్ట్రపతి అవార్డు గ్రహీత చింతల వెంకటరెడ్డి, శ్రీలక్ష్మిరెడ్డి, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, రత్నారెడ్డి, డీజే.వసంతరెడ్డికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి, రెడ్డి జేఏసీ జాతీయ అధ్యక్షుడు నవల్గా సత్యనారాయణరెడ్డి, తెలంగాణ రెడ్డి ఐక్యవేదిక అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐపీసీపీ మల్కాజిగిరి అభ్యర్థిగా నాగ ఉదయలక్ష్మి

నల్లకుంట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ (ఐపీసీపీ) మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థిగా శివలంక నాగ ఉదయలక్ష్మిని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ.శ్రీధర్ ప్రకటించారు. ఎంపీ ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ కూడా దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించలేదన్నారు. ఈ నేపథ్యంలో ఐపీసీపీ దివ్యాంగ విభాగం జాతీయ అధ్యక్షురాలు శివలంక నాగ ఉదయలక్ష్మిని ప్రకటించినట్లు ఆయన స్పష్టం చేశారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటుబ్యాంకు కోసం దివ్యాంగులకు పెన్షన్లు మాత్రమే కల్పిస్తే సరిపోతుందని పాలకులు భావిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు వాసుదేవరావు, భాస్కర్‌నేత, ఆవుల అల్లాజీయాదవ్, కొండల్‌రావు, సరిత, నవీనరాణి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడ్డ వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి: బాధితుడు, డీఎస్పీ నేతలు

కవాడిగూడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తమ ఇంటి నిర్మాణ విషయంలో జోక్యం చేసుకోవడమే కాకుండా కులంపేరుతో దూషిస్తూ భౌతిక దాడులకు పాల్పడిన వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం హరిదాస్‌పల్లి గ్రామానికి చెందిన పటోళ్ల రాజేందర్‌రెడ్డి, పటోళ్ల హర్షవర్ధన్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు అదే గ్రామానికి చెందిన బాధితుడు గట్టిపల్లిరాజు తెలిపారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బాధితుడు గట్టిపల్లి రాజుకు ధర్మసమాజ్ పార్టీ ఉమ్మడి హైదారబాద్ జిల్లానాయకులు కృష్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాఘవేంద్రముదిరాజ్, సంతోష్ మహారాజు, వికారాబాద్ జిల్లా నాయకులు మల్లికార్జున్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎస్సీ ఉప కులాలకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి: హక్కుల పోరాట సమితి

బర్కత్‌పుర, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్, ప్రత్యేకబోర్డు ఏర్పాటు చేయాలని ఎస్సీ ఉప కులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి.వెంకటేష్ మోచి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాల, మాదిగలతో సమానంగా ఎస్సీ ఉపకులాలకు పార్లమెంట్ సీట్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఉపకులాలపై ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ చేసిన వ్యాఖ్యలను ఆయన వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి సమావేశంలో వెంకటేష్ మాట్లాడారు. ఇప్పటి వరకు ఉపకులాలకు ఒక ఎంపీ, ఎమ్మెల్యే టికెట్ కూడా ఇవ్వలేదని, రాజకీయ పార్టీలు ఈ పద్ధతిని మార్చుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు టి.ఎస్.స్వామి, సత్యనారాయణ, మహేందర్, నర్సింగ్‌మోరే, బాల్‌రాజ్, శోభ, రామారావు, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగుల బడికి బస్సు బహూకరణ



మానసిక దివ్యాంగుల పాఠశాలకు బస్సును బహూకరిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వేగేశ్న ఫౌండేషన్ నగరంలో నిర్వహిస్తున్న మానసిక దివ్యాంగులు, ఆటిజం ప్రత్యేక పాఠశాలకు బీఎస్‌సీపీఎల్ కంపెనీ స్థాపకుడు బొల్లినేని కృష్ణయ్య 21 సీట్స్ బస్సును బహూకరించారు. 35 సంవత్సరాలుగా వేగేశ్న ఫౌండేషన్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వేగేశ్న ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ వంశీ రామరాజు, చైర్‌పర్సన్ శైలజ సుంకరపల్లి, బీఎస్‌సీపీఎల్ కంపెనీ కార్యదర్శి రాఘవయ్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అష్టోత్తర శత సంకీర్తన మహానైవేద్యం

చిక్కడపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎఎస్ఎస్‌వీ ఫౌండేషన్, సంకీర్తన ప్రీప్రైమరీ స్కూల్ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో తాళ్లపాక అన్నమాచార్య 521వ ఆరాధన మహోత్సవాన్ని ఆకట్టుకునేలా నిర్వహించారు. సంకీర్తనాచార్య వేంకటేశ్వర కోటపాటి గోవింద దాస వారు స్వరపరచిన 108 అన్నమయ్య సంకీర్తనలతో అష్టోత్తర శత సంకీర్తన మహానైవేద్యం పేరిట ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 108 మంది గాయనీగాయకులు 12 గంటలపాటు నిర్విరామంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

సృష్టిలో అన్నింటినీ ప్రేమించాలి: వక్తలు

వివిధ రంగాల్లో ప్రముఖులకు ఉగాది విశిష్ట పురస్కారాల ప్రదానం



బాలరామకృష్ణకు విశిష్ట ఉగాది పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్‌రావు తదితరులు

నల్లకుంట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ సమస్త జీవ రాశుల స్వేచ్ఛాజీవన విధానానికి ఎలా ఉపకరిస్తుందో అలాగే సృష్టిలో అన్నింటినీ ప్రేమించాలని,అప్పుడే వసుధైక కుటుంబంగా విరాజిల్లుతుందని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం నల్లకుంట మెయిన్‌రోడ్ శ్రీశృంగేరీ శంకరమఠంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు తెలుగు భాషా చైతన్య సమితి, లక్ష్యసాధన ఫౌండేషన్, కుసుమ ధర్మ కళాపీఠం, గోల్కొండ సాహితీ కళాసమితి, పాలడుగు నాగయ్య కళాపీఠం, దర్పణం సాహిత్య వేదిక, ప్రగతిశీల వీరశైవ సమాజం సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది జాతీయ కవిసమ్మేళనం, ఉగాది విశిష్ట పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్‌రావు, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ బాలాచారి, అతిథులుగా గంట మనోహర్‌రెడ్డి, డాక్టర్ బి.జయరాములు, కె.నరేందర్‌రెడ్డి, భైలారి యోగేష్ ప్రభు, కె.దయానంద్, పీవీపీ.అంజనీకుమారి, డాక్టర్ బి.రాజారత్నం, డాక్టర్ చింది బద్రీనాథ్, నక్క శ్రీనివాస్‌యాదవ్, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, రామకృష్ణ, చంద్రమౌళి, డాక్టర్.అర్థచంద్రప్రకాష్‌రెడ్డి, బైస దేవదాసు, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సృజనాత్మకమైన కవిత్వం ద్వారా యువత కొత్తకోణంలో ఆలోచింపజేస్తుందని, అందుకు కవులు తమ కలాలకు పదునుపెట్టాలని సూచించారు. మానవ జీవన విధానానికి అనుసంధానం చేస్తూ ఆహార, ఆరోగ్యం పరిరక్షణ వంటివి ఈ పండుగల వల్ల తేటతెల్లమవుతాయని అన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లోని ఆళ్ల రామకృష్ణ, వాచస్పతి డాక్టర్.మర్రి కృష్ణారెడ్డి, వేమూరి అనంతరామకృష్ణశర్మ, డాక్టర్ బలిజేపల్లి నాగరత్నం, వేమూరి మంజులకు ఉగాది విశిష్ట పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాలడుగు సరోజినిదేవి, ప్రజ్ఞారాజు, జ్ఞానప్రసూన, డాక్టర రాధాకుసుమ, పి.బడేసాబ్ పాల్గొన్నారు.

భోలక్‌పూర్‌కు రంజాన్ కళ



భోలక్‌పూర్‌లో పండుగ సామగ్రిని కొనుగోలు చేస్తున్న మహిళలు



సేమియాను అమ్ముతున్న దృశ్యం

ముషీరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను పురస్కరించుకుని భోలక్‌పూర్‌లో వెలసిన షాపుల వద్ద కొనుగోళ్లతో సందడి వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి అర్ధరాత్రివరకు కొనుగోలు కొనసాగుతుండడంతో షాపులన్నీ కిటకిటలాడుతున్నాయి. చార్మినార్‌ను తలపించే విధంగా భోలక్‌పూర్‌లో వాతావరణం నెలకొంది. పండుగకు కావాల్సిన షీర్‌కుర్మా, అత్తర్, దుస్తులు, గాజులు, షుర్మా, డ్రైఫ్రూట్స్ తదితర వస్తువుల అమ్మకాలతో రద్దీగా ఉంటోంది. అర్ధరాత్రి వరకు విద్యుత్ కాంతుల వెలుగుల్లో కొనుగోలుదారులతో భోలక్‌పూర్ కళకళలాడుతోంది. గతంలో ముస్లింలు పండుగ సామగ్రిని కొనుగోలు చేసేందుకు చార్మినార్ వెళ్లేవారు. ఈ సంవత్సరం భోలక్‌పూర్‌లోనే పండుగకు కావాల్సిన ప్రతి వస్తువూ లభిస్తుండడంతో స్థానికులతో పాటు స్థానికేతరులు కూడా భోలక్‌పూర్‌కు తరలివచ్చి, కావల్సిన సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు.



రంజాన్ మాసం సందర్భంగా ఎన్ఎస్‌యూఐ గ్రేటర్ అధ్యక్షుడు ఎడ్ల.అభిజిత్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడ డివిజన్ మోతిమార్కెట్‌లో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ముస్లిం యువత ఈ విందులో పాల్గొన్నారు. - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

హక్కుల సాధనకు జస్టిస్ రామలింగేశ్వర్‌రావు కృషి మరువలేనిది

● బీసీ హక్కుల పరిరక్షణ సమితి నేతలు



జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావుచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీసీ హక్కుల పరిరక్షణ సమితి నేతలు

కవాడిగూడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బీసీఏ కులస్థుల హక్కుల సాధనకు స్వర్గీయ జస్టిస్ ఎ.రామలింగేశ్వర్‌రావు చేసిన కృషి మరువలేనిదని బీసీ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు డాక్టర్ భాగయ్య, అధ్యక్షుడు నరహరి అన్నారు. హైకోర్టు న్యాయవాదిగా, హైకోర్టు జడ్జిగా రామలింగేశ్వర్‌రావు బడుగు బలహీన వర్గాల ప్రజల హక్కుల సాధన కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. ఆదివారం కవాడిగూడ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని బండమైసమ్మనగర్‌లో ఉన్న తెలంగాణప్రదేశ్ గంగపుత్ర రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జస్టిస్ రామలింగేశ్వర్ రావు హఠార్మణం యావత్ బీసీ కులాలకు తీరనిలోటని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళుతూ బీసీల హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి, న్యాయవాది వి.బాలరాజ్, గూడబోయిన శివరత్నం, అంబటి మల్లయ్య సుధాకర్, కంటె రాంచందర్, సత్యనారాయణ, గడప శంకర్, సమితి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కేజ్రీవాల్ అంటే మోదీకి భయం

● అందుకే ఆయన్ను అరెస్టు చేయించారు : దిడ్డి సుధాకర్

● ధర్నాచౌక్ దగ్గర ఆప్ నాయకుల నిరాహార దీక్ష



ధర్నాచౌక్‌లో నిర్వహించిన నిరాహారదీక్షలో మాట్లాడుతున్న తెలంగాణ ఆప్ కన్వీనర్ సుధాకర్

కవాడిగూడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కేజ్రీవాల్‌ను చూసి మోదీ భయపడుతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతానేమోనన్న భయంతోనే కేజ్రీవాల్‌పై అక్రమ కేసు బనాయించి జైల్లో పెట్టించారని ఆరోపించారు. ఈడీ, సీబీఐ లాంటి దర్యాప్తు సంస్థలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన జేబు సంస్థలుగా మార్చుకొని, ప్రతిపక్ష నేతలను బెదిరిస్తోందన్నారు. దర్యాప్తు సంస్థల సాయంతోనే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలిచేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఢిల్లీ మద్యం కేసులో కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఆదివారం దేశవ్యాప్తంగా జరిగిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా.. ధర్నాచౌక్‌లో ఆప్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో కూడా నిరసన నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సుధాకర్ అధ్యక్షత వహించగా.. కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, సీపీఐ రాష్ట్ర నాయకుడు బాలమల్లేశ్‌తో పాటు పలు పార్టీల నేతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. లిక్కర్ స్కామ్‌లో ఎలాంటి ఆధారాలు లేకపోయినప్పటికీ కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారన్నారు. బీజేపీకి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో విరాళాలు ఇచ్చినవారిని బెయిల్‌పై విడుదల చేశారని ఆరోపించారు. కేజ్రీవాల్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి బేషరతుగా విడుదల చేయాలని సుధాకర్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిదే విజయమని ఆయన పేర్కొన్నారు. దీక్షలో సీపీఎం, సీపీఐ నాయకులు, పలువురు వక్తలు మాట్లాడారు. కేజ్రీవాల్ అరెస్టును వారంతా ఖండించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు.

పీఆర్‌సీ బాండ్స్ బకాయిల చెల్లింపుల్లో వివక్ష వద్దు

● ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో 2013 పీఆర్‌సీ బాండ్స్ బకాయిలను కేవలం 15వేల మంది డ్రైవర్లకే చెల్లించి, కండక్టర్లు, ఇతర కార్మికులు, ఉద్యోగులకు నిలిపివేయడం అన్యాయమని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వర్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం పథకాన్ని విజయవంతంగా అమలు చేయడంలో డ్రైవర్లతోపాటు కండక్టర్లు, ఇతర గ్యారేజీ కార్మికులు సైతం కృషిచేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఆర్టీసీలో సుమారు 42 వేల మంది కార్మికులు దాచుకున్న బాండ్స్ డబ్బులను అందరికీ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేవలం 15వేల మంది డ్రైవర్లకు అందించి, మిగిలిన 27 వేలమందికార్మికులు(15వేల మందికండక్టర్లు, 4వేల మంది గ్యారేజీ, 6వేల మంది ఇతర సెక్యూరిటీ క్లరికల్, సూపర్‌వైజర్‌లు)ను విస్మరించడం దారుణమన్నారు. తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పండుగ నాటికి 2013 నాటి పీఆర్‌సీ బకాయిలను పూర్తి స్థాయిలో ఆర్టీసీలోని కార్మికులందరికీ చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన ఆర్టీసీ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. పీఆర్‌సీ బకాయిలు చెల్లింపుల కోసం రాష్ట్రప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ ఆర్టీసీ యాజమాన్యం నిర్లక్ష్యం చేయడం భావ్యం కాదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన నిధులు, సబ్సిడీల చెల్లింపులు, ఆర్టీసీ ఆర్థిక పరిస్థితిపై యాజమాన్యం శ్వేతపత్రం విడుదల చేయాలని నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు.



పద్మారావుతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ యువనాయకుడు జైసింహ

సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరాలి

ముషీరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయం ఖాయమని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి టి.పద్మారావుగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువ నాయకుడు ముఠా జైసింహ ఆధ్వర్యంలో ఆరు డివిజన్ల అధ్యక్షులు పద్మారావుగౌడ్‌ను కలిసి నియోజకవర్గంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం పద్మారావు మాట్లాడుతూ.. ప్రజల్లో బీఆర్ఎస్‌పై పూర్తినమ్మకం ఉందని అందువల్లే నగరంలో అన్ని అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించామన్నారు. అదే స్ఫూర్తి పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కొనసాగేలా నాయకులు అంకిత భావంతో పనిచేయాలన్నారు. అనంతరం ఈ పద్మారావు గౌడ్‌ను ముఠా జైసింహ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు డి.శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, నాయకులు సాయి, భీమ్, కళ్యాణ్ పాల్గొన్నారు.

పద్మారావు విజయానికి సహకరించాలి

రాంనగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా పద్మారావు విజయానికి సహకరించాలని బీఆర్ఎస్ అంబర్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి కోరారు. ఆదివారం సుధాకర్‌రెడ్డి తన అనుచరులతో పద్మారావును కలిసి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల సీనియారిటీ లిస్టును ప్రకటించాలి

రాంనగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ అధికారుల సీనియారిటీ లిస్టును ప్రకటించాలని తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో వ్యవసాయ అధికారుల సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు రైతులను చైతన్యం చేయడానికి పలు గ్రామాల్లో పర్యటించాల్సిన నేపథ్యంలో సదరు అధికారులందరికీ వాహన సదుపాయం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. దీర్ఘకాలంగా దూరప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులతోపాటు ల్యాబ్‌ల్లో పనిచేస్తున్న వారిని బదిలీ చేయాలని కోరారు. 317 జీవోను మార్పు చేయడంతోపాటు 11వ పీఆర్‌సీని అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం చైర్మన్ బి.కృపాకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి జి.కృపాకర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి మానస, ఉపాధ్యక్షులు శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా కిషన్‌రెడ్డి గెలుపు ఖాయం : కార్పొరేటర్

ముషీరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ అభ్యర్థి కిషన్‌రెడ్డి గెలుపు ఖాయమని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ముషీరాబాద్‌లో బీజేపీ అధిష్ఠానం పిలుపుమేరకు టిఫిన్ బైటక్ కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులు స్థానిక ప్రజలతో కలిసి టిఫిన్ చేస్తూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ బీజేపీకి ఓటు వేసే విధంగా పార్టీ నాయకులు కృషిచేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బద్రినారాయణ, కంచికుమార్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణ, అజయ్ గుప్తా, నాయకులు రాజు, లక్ష్మణ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో చైన్ స్నాచింగ్

జవహర్‌నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిగూడలో ఆదివారం నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలి మెడలోని గొలుసును బైక్‌పై వచ్చిన ఓ యువకుడు లాక్కొని పారిపోయాడు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన సాయమ్మ(60) కుమార్తెతో కలిసి ఈసీఐఎల్‌లోని బంధువుల ఇంటికి వచ్చింది. ఆదివారం సాయంత్రం తన పెద్ద కుమార్తెతో కలిసి కాప్రాలోని ఎల్లారెడ్డిగూడలో ఉంటున్న చిన్నకుమార్తె ఇంటికి ఆటోలోవచ్చింది. కుమార్తె ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా.. వెనుక నుంచి పల్సర్‌బైక్‌పై వచ్చిన యువకుడు మెడలోని 5తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

రత్నదీప్ సూపర్ మార్కెట్‌లో అగ్నిప్రమాదం

నార్సింగ్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో త్వరలో ప్రారంభం కానున్న ఓ సూపర్ మార్కెట్ కాలిబూడిదైంది. ఈ ఘటన బండ్లగూడ మున్సిపాలిటీ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. లంగర్‌హౌజ్-అప్పా రేడియల్ మార్గంలో ప్రధాన రోడ్డుకు అనుకుని రత్నదీప్ సెలెక్ట్ సూపర్ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఉగాది నుంచి ప్రారంభం కావాల్సిన మార్కెట్‌లో సెంట్రల్ ఏసీతో పాటు అన్ని రకాల ఎలక్ట్రికల్ పరికరాల ఏర్పాటు జరుగుతోంది. ఆదివారం సామగ్రి ఏర్పాటు చేస్తుండగా అగ్ని ప్రమాదం జరిగిందని, మంటలకు దట్టమైన పొగ అలుముకోవడంతో అందరం ఒక్కసారిగా బయటకు పరుగులు పెట్టామని కార్మికులు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో కార్మికులు ఎవరూ గాయపడలేదని జిల్లా అగ్నిమాపక అధికారి గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఆస్తి నష్టం లక్షల్లోనే ఉంటుందని, ఈ ప్రమాదానికి వెల్డింగ్ పనులు కారణమా లేక షార్ట్ సర్క్యూట్ కారణమా అన్నది దర్యాప్తులో తేలుతుందని అన్నారు. ఈ ఘటనపై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

జీవనశైలిలో మార్పులతోనే మంచి ఆరోగ్యం

రాంనగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బీపీ, షుగర్ రోగులకు జీవనశైలిలో మార్పులు అవసరం అని సీనియర్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ప్రత్యూష పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్ జిందాబాద్ సంస్థ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరోగ్యంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉదయం వ్యాయామం చేయాలని సూచించారు. ఆహార పద్ధతుల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయసూర్య, హైదరాబాద్ జిందాబాద్ సంస్థ ప్రధానకార్యదర్శి కె.వీరయ్య ప్రతినిధులు ఎం.శ్రీనివాస్‌రావు, పి.శ్రీనివాస్‌రావు, సైదులు, పి.నాగేష్, రాజమౌళి, సుకుమార్, మోహన్, గోపాల్, అస్మిత, సంగీత, లలిత, శంకరయ్య, రవీంద్రనాథ్, రాములు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల కోసం 70వ రోజూ రిలేనిరాహారదీక్షలు



బస్తీవాసుల నిరసనకు సంఘీభావంగా దీక్షలో పాల్గొన్న దళితమోర్చా నేతలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దళితుల ఇళ్లను అకారణంగా కూల్చివేయడం వారిపై వివక్ష చూపడమేనని సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ ధ్వజమెత్తారు. కోర్టుఉత్తర్వుల పేరిట70 సంవత్సరాలుగా నివసిస్తున్న గాంధీనగర్ డివిజన్ స్వామివివేకానందనగ్ బస్తీవాసులను అకారణంగా తొలగించడం అన్యాయం, అక్రమమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వివేకానందనగర్ బస్తీలోని ఇళ్లను కూల్చివేసి ఆదివారానికి 70 రోజులు అవుతున్న సందర్భంగా బీజేపీ దళిత మోర్చా నాయకులతో కలిసి వినయ్‌కుమార్ బాధితుల రిలేనిరాహారదీక్షలకు సంఘీభావం ప్రకటించి దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లను కూల్చివేసి 70 రోజులు అవుతున్నా కూడా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా లేకపోవడం దారుణమని మండిపడ్డారు. నివాసులను రోడ్డుపాలు చేసిన అధికారులు, ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరి ఆయన ఖండించారు. బాధితులకు పునరావాసం కల్పించాలన్న కోర్టు ఆదేశాలను సైతం ధిక్కరించి పేదలకు ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆరోపించారు. నిరసనలో బీజేపీ దళిత మోర్చా సీనియర్ నాయకులు ముత్యాలు, నర్సింహ, భారత్, సాయికుమార్, ఓబీసీమోర్చా డివిజన్ అధ్యక్షుడు సత్యేందర్, నాయకులు హనుమంతు, కుమార్, యాదగిరి, బస్తీవాసులు ఎంటీ.కృష్ణ, జ్ఞానేశ్వర్, ఆనంద్‌రావు, సంపత్, వసంత్, సాయిరామ్ పాల్గొన్నారు.



బెల్ట్ గ్రేడింగ్, సర్టిఫికెట్లు పొందినవారితో నిర్వాహకులు

తైక్వాండోతో దేహదారుఢ్యం.. స్వీయరక్షణ

చిక్కడపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడంవల్ల దేహదారుఢ్యంతో స్వీయరక్షణ చేసుకోవచ్చునని తైక్వాండో గ్రాండ్ మాస్టర్ వెంకటేశం అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని జీహెచ్ఎంసీ ప్లేగ్రౌండ్‌లో ఆదివారం తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సంస్థ కార్యదర్శి తైక్వాండో మాస్టర్ బి.కృష్ణ పర్యవేక్షణలో తైక్వాండోలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్, బ్లాక్‌బెల్ట్ సర్టిఫికెట్ల ప్రదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంకటేశం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఈ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంటే స్వీయరక్షణ కోసం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా 200 మంది విద్యార్థులకు కలర్‌బెల్ట్‌లు, సర్టిఫికెట్లను బహూకరించారు.

ఈ కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఎగ్జామినర్ సంజయ్‌సింగ్, కోచ్‌లు కార్తీ, మనీష్, రఘు, స్వామి, సిద్ధు, వెంకట్, భాస్కర్, క్రితిక్ తదితర క్రీడాకారులు పాల్గొన్నారు.

అఖిల భారత పద్మశాలీ నిత్యాన్నసత్రం యాదగిరిగుట్ట అధ్యక్షుడిగా సుదర్శన్‌రావు



గోల్నాక, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అఖిలభారత పద్మశాలీ నిత్యాన్నసత్రం యాదగిరిగుట్ట నూతన అధ్యక్షుడిగా గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలీ సంఘం అధ్యక్షులు కత్తుల సుదర్శన్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యాదగిరిగుట్టలోని అన్నసత్రంలో జరిగిన ఎన్నికల్లో కత్తుల సుదర్శన్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.